
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 9 డిసెంబరు 2025



టెట్ పక్కాగా నిర్వహించాలి
● ఐదు కేంద్రాల్లో పదో తేదీ నుంచి పరీక్షలు
● డీఆర్వో మురళి

6లో

ఫిర్యాదు దారులకు న్యాయం చేయాలి
● ఎస్పీ దామోదర్



ముక్తిమార్గంలో ఆపదల ముళ్లు



తమిళనాడులో ప్రమాదానికి గురైన కారు ఇదే

● ఏటా ప్రమాదాల బారిన అయ్యప్ప భక్తులు ● శబరిమలైకు నేరుగా దక్కని రైలు ప్రయాణం
● సర్వీసులన్నీ విశాఖ నుంచే ● ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న భక్తులు
● ప్రమాదం అంచున 1400 కిలోమీటర్ల ప్రయాణం

రాజాం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శబరిమలై యాత్ర కొందరికి విషాదంగా మారుతుండడం ఆందోళన కలిగిస్తోంది. మొన్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన అయ్యప్ప భక్తులు అనుకోని ప్రమాదంలో చనిపోయారు. ఆ ఘటన మరువక ముందే విజయనగరం జిల్లాకు చెందిన నలుగురు భక్తులు తమిళనాడులో రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం పాలయ్యారు. ఏటా ప్రతి జిల్లా నుంచి వెళుతున్న కొందరు భక్తులు ఇదే మాదిరిగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో దాదాపు 30 వేల మందికిపైగా భక్తులు అయ్యప్ప దీక్ష తీసుకున్నారు. కార్తీక మాసంలో దీక్ష ప్రారంభించి 41 రోజుల పాటు కొనసాగిస్తారు. మకర సంక్రాంతి వరకూ ఈ దీక్షలు కొనసాగుతాయి. అయితే భక్తుల రద్దీ పెరిగి వారు వెళ్లే సమయంలో రైళ్లు అందుబాటులో (మిగతా 8వ పేజీలో..)



ప్రత్యేక రైళ్లు నడపాలి

శబరిమలై యాత్రలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. రైల్వేశాఖ స్పందించి జిల్లా నుంచి ప్రత్యేక రైళ్లను నడపాలి. విజయనగరం నుంచి నేరుగా నడిపితే జిల్లావాసులకు ప్రయోజనం. ప్రజాప్రతినిధులే చొరవ చూపాలి.

- నర్సింహులు, అయ్యప్ప భక్తుడు, బొబ్బిలి

రవాణా మెరుగుపడాలి

జిల్లా నుంచి దాదాపు 1400 కిలోమీటర్లు ప్రయాణిస్తే కానీ శబరిమలై చేరుకోలేం. ఎంతో నిష్టతో శబరిమలై వెళ్లే క్రమంలో రవాణా సదుపాయం మెరుగ్గా ఉండాలి. ఈ విషయంలో రైల్వేశాఖ స్పందించి అదనపు సర్వీసులను నడిపితే భక్తులకు చాలా ఉపయోగం.

- కుమార్, అయ్యప్ప భక్తుడు, రాజాం

కన్నీటి సంద్రం

● స్వగ్రామాలకు చేరిన అయ్యప్ప భక్తుల మృతదేహాలు
● కడసారి చూసేందుకు క్యూకట్టిన ఆత్మీయులు
● నివాళులు అర్పించిన మంత్రి శ్రీనివాస్

గజపతినగరం/దత్తిరాజేరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆ రెండు గ్రామాలు కన్నీటి సంద్రమయ్యాయి. తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అయ్యప్ప భక్తుల మృతదేహాలు సోమవారం ఉదయం స్వగ్రామాలకు చేరాయి. అప్పటికే చివరిచూపు కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు పార్థివ దేహాలను చూసి కన్నీరుపెట్టారు. నిన్న మొన్నటి వరకు తమతో కలిసి తిరిగిన ఆ నలుగురిని అచేతన స్థితిలో చూసి తీవ్రంగా విలపించారు. గజపతినగరం మండలం మరుపల్లికి బండారు చంద్రరావు మృతదేహం చేరే సమయానికి గ్రామమంతా మూగబోయింది. మృతుని ఇంటికి గ్రామస్థులంతా తరలివచ్చారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. మృతదేహం వద్ద నివాళి అర్పించారు. ప్రమాదం నుంచి బయటపడిన బెవర శ్రీరాములు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏఎంసీ ఛైర్మన్ (మిగతా 8వ పేజీలో..)



కోరపుకొత్తవలసలో మృతునికి నివాళి అర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్





కలెక్టరేట్ వద్ద బైఠాయించి నినాదాలు చేస్తున్న గుర్ల మండల రైతులు, (ఇన్‌సెట్)లో రోడ్డుపై నిద్రిస్తూ వినూత్న నిరసన

పచ్చని పొలాల్లో పరిశ్రమ వద్దు

● కదంతొక్కిన గుర్ల రైతులు ● కలెక్టరేట్ వద్ద భారీగా ఆందోళన

విజయనగరం కలెక్టరేట్ డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పచ్చని పొలాల్లో పరిశ్రమ ఏర్పాటు చేసి జీవనోపాధిని నాశనం చేయొద్దు.. పర్యావరణాన్ని పాడుచేయొద్దు.. పొలాల్లో ఉక్కు ఆరోగ్యానికి ముప్పు.. అంటూ గుర్ల మండల రైతులు ఉవ్వెత్తున నినాదాలు చేశారు. వారి అరుపులు కేకలతో కలెక్టరేట్ దద్దరిల్లిపోయింది. గుర్ల మండలంలో ఏర్పాటు చేయనున్న స్టీల్‌ప్లాంట్‌ను వ్యతిరేకిస్తూ ఆయా గ్రామాల రైతులు సోమవారం ఉదయం కలెక్టరేట్‌కు భారీగా చేరుకున్నారు. గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. గుర్ల మండలం దమరసింగి, వల్లాపురం, బెల్లానపేట, మనిప్యూరిపేట, ఎస్ఎస్ఆర్ పేట, కెల్ల తదితర గ్రామాలకు చెందిన రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. మధ్యాహ్నం వరకూ గేటు వద్ద నిరసన తెలిపారు. అంతకుముందు ఎన్టీఆర్ జంక్షన్‌లో మానవహారంగా (మిగతా 8వ పేజీలో..)

ఆందోళనలో వారు.. ఆశల్లో వీరు





శృంగవరపుకోట: తాటిపూడి రోడ్డుకు అనుకుని ఉన్న జిందాల్ ఇండస్ట్రియల్ పార్కు కార్యాలయం



● నిరసన బాటలోనే జిందాల్ భూ నిర్వాసితులు
● ఎటూ తేల్చని పరిశ్రమ యాజమాన్యం ● ఎంఎస్ఎంఈ పార్కుల స్థాపనకు పడని పునాది
● ఉపాధి కోసం ఎదురుచూస్తున్న యువత

'శృంగవరపుకోట డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): భూములు తీసుకున్న సమయంలో ఎకరాకు రూ.2,00,500 ఇచ్చారు. మార్కెట్ విలువను పాటించలేదు. భూమి కోల్పోయిన ప్రతి రైతుకు ఆ భూమికి సమాన విలువ కలిగిన షేర్లు ఇస్తామన్నారు. పరిశ్రమలో ఉద్యోగం చేసేందుకు ఒడిశా రాష్ట్రంలోని పర్లాకిమిడిలో శిక్షణ ఇచ్చారు. కానీ పరిశ్రమను స్థాపించలేదు. అన్ని వసతులతో కాలనీ నిర్మిస్తామని చెప్పారు. ఇలా ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదు. ఇప్పుడు ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణం చేపడతామంటున్నారు. అప్పట్లో ఇచ్చిన హామీలను ఎవరు నెరవేర్చుతారు. ఇన్నాళ్లుగా మాకు జరిగిన నష్టంపై న్యాయం కావాలి. లేదంటే మా భూములను మాకు తిరిగి ఇచ్చేయండి.' - 176 రోజులుగా ఎస్.కోట మండలం బొడ్డవరలో జిందాల్ భూ నిర్వాసితులు చేస్తున్న ఆందోళనలో వినిపిస్తున్న మాటలివి.

ఓ పక్క ఆందోళన కొనసాగిస్తూనే మరోపక్క ప్రతి సోమవారం జరిగే కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో వినతులు ఇస్తున్నారు. ఇంకోవైపు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్‌లకు ఫిర్యాదు చేశారు. హైకోర్టులోనూ (మిగతా 8వ పేజీలో..)

అమ్మో..చలి!

● భారీగా పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు
● చిన్నారులు, వృద్ధులపై ప్రభావం 6
● జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు



పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు



విజయనగరం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసుస్టేషన్‌లో కొద్ది నెలల కిందట నమోదైన పోక్సో కేసులో కీలక తీర్పు వెలువడింది. నిందితుడు నగరంలోని గాజులరేగకు చెందిన బొండపల్లి సత్యారావుకు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి తీర్పు చెప్పారు. అలాగే బాధితురాలికి ఆర్థిక ఆసరా కింద రూ.5 లక్షలు మంజూరు చేయాలని ఆదేశించినట్లు ఎస్పీ దామోదర్ సోమవారం తెలిపారు. నగరంలోని గాజులరేగకు చెందిన బొండపల్లి సత్యారావు వరసకు మనుమరాలైన మైనర్ బాలికపై అత్యాచారానికి యత్నించాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 2025 ఆగస్టు 18న ఎస్ఐ శిరీష పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. అనంతరం మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అనంతరం కొద్ది వ్యవధిలోనే న్యాయస్థానంలో అభియోగ పత్రాలు దాఖలు చేయించారు. నిందితుడు సత్యారావుపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు.

ఎక్కడికక్కడే లీకేజీలు



అంబటిసత్రం కూడలిలో పైపులైన్‌కు లీకులు

● నాలుగు దశాబ్దాలుగా అవే పైప్‌లైన్ల వినియోగం
● పట్టు తప్పుతున్న వైనం ● మరమ్మతులకే రూ.లక్షల్లో వ్యయం
● పైప్‌లైన్ మార్పుపై దృష్టి సారించని అధికారులు

విజయనగరంలో తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్లు పట్టుతప్పాయి. చాలాచోట్ల పూర్తిగా తుప్పుపట్టాయి. ఎక్కడికక్కడే లీకులు ఏర్పడుతున్నాయి. నాలుగు దశాబ్దాలుగా వాటినే వినియోగిస్తుండడంతో పాడయ్యాయి. అధికారులు కొత్త పైపులను ఏర్పాటు చేయకుండా ఉన్నవాటికి మరమ్మతులు చేయడానికే ప్రయత్నిస్తున్నారు. దీనివల్ల ఉపయోగం ఉండడం లేదు. ప్రతిరోజూ చాలా తాగునీరు వృథాగా పోతోంది.

విజయనగరం టౌన్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): విజయనగరం కార్పొరేషన్ పరిధిలో దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన పైపులైన్‌ల ద్వారానే ఇప్పటికీ తాగునీటి పంపిణీ జరుగుతోంది. వాటిని మార్చే దిశగా అధికారులు ఆలోచించడం లేదు. కొన్ని పైపులు మురుగు కాల్వల్లో ఉండటంతో అవి మరింత దారుణంగా కనిపిస్తున్నాయి. తాగునీటిలో మురుగు కలిసిపోయి నీరు కలుషితం అవుతోందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. అలాగే ప్రధాన రహదారిలో ఉన్న అంబటిసత్రం, కొత్తపేట, కంటోన్మెంట్, దాసన్నపేట ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పైప్‌లైన్లు మరమ్మతులకు గురవుతున్నాయి. బాగు చేయించేందుకు నూతనంగా వేసిన తారురోడ్డును (మిగతా 8వ పేజీలో..)



కొత్తపేట వాల్వ్ వద్ద లీకవుతున్న నీరు

బుడాపై నేడు అమరావతిలో సమావేశం

● మాస్టర్ ప్లాన్‌ల ఆమోదంపైనే..
● బయలుదేరి వెళ్లిన బుడా, మునిసిపల్, పంచాయతీ అధికారులు



బుడా కార్యాలయం ఉన్న భవనం

బొబ్బిలి డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా)పరిధిలోని మూడు మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీలలో అమలు చేయనున్న మాస్టర్ ప్లాన్‌ల అప్రూవల్ కోసం మంగళవారం సంబంధిత ఉన్నతాధికారులు అమరావతిలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. బుడా పరిధిలో బొబ్బిలి, మన్యం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు మునిసిపాలిటీలు, ఆయా నియోజకవర్గాల పరిధిలోని గ్రామపంచాయతీలు ఉన్నాయి. రాబోయే 20 సంవత్సరాల విజన్ డాక్యుమెంట్ తయారీ కోసం అన్ని పట్టణాలు, గ్రామ పంచాయతీలు మాస్టర్‌ప్లాన్ ముసాయిదాలను రూపొందించాయి. వాటిని ప్రాథమికంగా ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ఇప్పటికే ప్రచురించాయి. ప్రజల నుంచి పలు అభ్యంతరాలను (మిగతా 8వ పేజీలో..)

వేతన సవరణ చేయాలి

● జీవో36ను అమలు చేయాలి
● పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన 6

బియ్యాలవలసలో ఏనుగులు 6

అమ్మో.. చలి!

- భారీగా పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు
- చిన్నారులు, వృద్ధులపై ప్రభావం
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు



చలితో పాటు మంచు వాతావరణం కావడంతో ఇంటి గోడలు కూడా చల్లబడి పోతున్నాయి. రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15-20 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి.

విజయనగరం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చలి వణికిస్తోంది. గత మూడు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. దీంతో వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే చలి తీవ్రత పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే మరీ ఎక్కువగా ఉంటోంది. ఇక నగరాల్లో ఎండ వచ్చే వరకూ బయటకు రాని పరిస్థితి. డిసెంబరు నెలలో చలి ఉండడడం సాధారణమే అయినా.. ఈఏడాది మరింత ఎక్కువగా ఉంది.

- బంగాళాఖాతం మీదుగా తూర్పుగాలులు వీయకపోవడంతో ఈశాన్య రుతుపవనాలు బలహీనంగా మారాయి. దీంతో అన్ని ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంది. అదే సమయంలో ఉత్తర, మధ్య భారతం మీదుగా రాష్ట్రంపైకి తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయన్న అభిప్రాయం వాతావరణ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకి కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతూ వస్తున్నాయి. రానున్న వారం రోజులు కూడా ఇదే పరిస్థితి ఉంటుందని, ఆ తరువాత రాత్రి పూట చలి కాస్త తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

వృద్ధులు వెచ్చని దస్తులు ధరించాలి

వృద్ధులు వెచ్చని దుస్తులు ధరించాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు వెళ్లడం తగ్గించాలి. గోరువెచ్చని నీరు తాగాలి. ఫ్లూ టీకా తీసుకోవవడం మంచిది. మహిళలు చర్మం పొడిబారికాకుండా మాయిశ్చరైజర్లు వాడాలి. పోషకాహారం, విటమిన్-డి ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. శిశువులకు వెచ్చని దుస్తులతో కప్పి ఉంచాలి. తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవాలి.

\- జీవనరాణి, జిల్లా వైద్యాధికారిణి

చలి దుస్తులకు పెరిగిన డిమాండ్

జిల్లా వ్యాప్తంగా చలిని తట్టుకునే దుస్తుల వైపు ప్రజలు చూస్తున్నారు. విజయనగరంతో పాటు ఎస్‌కోట, బొబ్బిలి, గజపతినగరం, డెంకాడ, భోగాపురం, తీర ప్రాంత గ్రామాల్లో కూడా చలి పెరగడంతో చలి తట్టుకునే దుస్తులకు డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా కొలకొత్తా, హైదరాబాదు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు రోడ్లపైనే వీటిని పెట్టి విక్రయిస్తున్నారు. 200 రూపాయల నుంచి 1,500 వరకూ వీటి ధర ఉంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు.. మహిళలు, పురుషులు అందరికీ వివిధ రకాల మోడళ్లల్లో ఇవి లభిస్తున్నాయి. విజయనగరంలో అయితే పెద్ద చెరువు చుట్టూ ఉన్న ఫుట్‌పాత్‌పై వ్యాపారులు వీటి విక్రయాలు చేస్తున్నారు.





చలి బాగా పెరిగింది

మూడు రోజులుగా చలి విపరీతంగా పెరిగింది. దీంతో ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. చలిని తట్టుకునేందుకు వీలుగా స్వెటర్‌ను వినియోగించక తప్పడంలేదు. గత ఏడాది ఇంత చలి లేదు. ఈ ఏడాది సంక్రాంతి రాకముందే ఇంత చలి ఉంటే రానున్న వారం పది రోజుల్లో ఎలా ఉంటుందోనని ఆందోళనగా ఉంది.

\- ఎం.కుమారి, నెల్లిమర్ల

ఊహించలేదు

చలి ఇంతగా ఉంటుందని ఊహించలేదు. నవంబరు నెల తొలి వారంలో పెద్దగా చలిలేదు. ఇప్పుడు సాయంత్రం ఆరు గంటలు దాటితే చలి కారణంగా బయటకు రాలేని పరిస్థితి. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో చలిని తట్టుకునేందుకు క్యాప్‌లు, చలి బనియన్లు (స్వెటర్స్) ధరిస్తున్నాం.

\- ఎస్.శంకర్, విజయనగరం

సైనికుల కోసం విరాళాలు అందించండి

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి పిలుపు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టరు రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ భద్రత కోసం నిరంతరం కృషిచేస్తున్న సైనికుల సంక్షేమం కోసం సామర్థ్యానికి తగినట్లుగా విరాళాలు అందించాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి కోరారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జాతీయ సాయుధ దళాల పతాక దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరు సాయుధ దళాల పతాక నిధికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి సేవలందిస్తున్న సైనికులు, మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.

పీజీ ఆర్‌ఎస్‌లో 273 వినతులు

విజయనగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియం సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో వివిధ సమస్యలపై 273 వినతులొచ్చాయి. రెవెన్యూకు సంబందించి 120 వినతులు, డీఆర్‌డీఏ 45 విరతె, మునిసిపల్ శాఖకు పది, పంచాయితీ శాఖ 13, విద్యుత్ శాఖకు 10, వైద్య ఆర్యోగ శాఖకు 15 వినతులు అందాయి. కలెక్టరు రామసుందర్ రెడ్డి, జేసీ సేతు మాధవన్, డీఆర్వో మురళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, శాంతి ,కళావతి తదితరులు వినతులు స్వీకరించారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపండి

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



సమస్యలపై వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆయనతో పాటు డీఆర్వో కె.హేమలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి వినతులను స్వీకరించారు. గరుగుబిల్లి మండలం చినగుడబ గ్రామానికి చెందిన ఎం.శ్రీదేవి గ్రామ రెవెన్యూలో 1ఏ ఐదు సెంట్ల పల్లం భూమిని ఆన్‌లైన్ చేయాలని అర్జీ అందజేశారు. గుమ్మలక్ష్మీపురంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన చర్చిని తొలగించాలని పి.ప్రసాదరావు వినతిపత్రం సమర్పించారు. బలిజిపేట మండలంలోని పెద్దబైరిపురాన్ని పంచాయతీ చేయాలని ఆర్.చంద్రశేఖరరావు అర్జీ అందజేశారు. తోటపల్లి నిర్వాసితులకు ఇచ్చిన స్థలాన్ని వేరే వ్యక్తులు ఆక్రమించుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని రామకృష్ణ, గుంపస్వామి, వేణు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన బిడ్డ నడవలేని పరిస్థితిలో ఉన్నాడని, ఆరోగ్య పరిస్థితి బాగోలేదని దామోదర్‌నాయుడుకు కలెక్టర్‌కు వివరించారు. తన బిడ్డకు పింఛన్ మంజూరు చేయాలని పట్టణానికి చెందిన కె.రవి అధికారులను కోరారు. దివ్యాంగుల శాతాన్ని తక్కువగా చూపించడం తాత్కాలిక ధ్రువీకరణ పత్రం ఇవ్వడం వల్ల పింఛను మంజూరు కావడం లేదని చెప్పారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలి: ఎస్పీ

విజయనగరం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ పరిధిలో ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి, 40 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదు అంశాలను పరిశీలించి వాస్తవమైతే, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఫిర్యాదు అంశాలు వాస్తవమైతే తీసుకున్న చర్యలను ఏడు రోజుల్లో నివేదించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్‌సీ సౌమ్యల, సీఐలు ఏవీ లీలారావు, కుమారస్వామి, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ దివ్యాంగుల పోటీలకు ఎంపిక

దత్తిరాజేరు మండలంలోని వంగర గ్రామానికి చెందిన ఈదుబిల్లి సూర్యనారాయణ అమెరికాలో జరగనున్న అంతర్జాతీయ దివ్యాంగుల పోటీలకు ఎంపికకావడంపై ఎస్పీ దామోదర్ అభినందించారు.క్రీడల్లో రాణించేందుకు అంగవైకల్యం అడ్డుకాదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ముంబాయిలో అమెచూర్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల బాడీబిల్డింగ్ పోటీల్లో సూర్యనారాయణ బంగారు పతకం సాధించాడు. ఈ మేరకు సోమవారం విజయనగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సూర్యనారాయణ ఎస్పీ దామోదర్‌ను కలిశారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ జిల్లా గౌరవాధ్యక్షుడు దయానంద్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



విజయనగరం క్రైం: ఫిర్యాదుదారుడి నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ దామోదర్

రోడ్డు ప్రమాదాల నియత్రణకు చర్యలు

భోగాపురం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసులకు సూచించారు. సోమవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి పోలీసులకు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని చెప్పారు. ద్విచ క్రవాహనచోదకులు హెల్మెట్ ధరించడంపై అవగాహనకల్పించాలని కోరారు. ఎయిర్ పోర్టు సమీప గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అంతక ముందు స్టేషన్ ఆవరణ, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ కె.దుర్గా ప్రసాదురావు, ఎస్ఐ వి.పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లిమర్ల: ధర్నా చేస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు



గజపతినగరం: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

వేతన సవరణ చేయాలి

- జీవో -36ను అమలు చేయాలి
- పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన

వేతన సవరణ చేయడంతోపాటు జీవో-36ను అమలుచేయాలని పీఏసీఎస్ ఉద్యోగులు డిమాండ్‌చేశారు.ఈ మేరకు సోమవారం పీఏసీఎస్, డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

గజపతినగరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సహకార సంఘ ఉద్యోగులు నల్లబ్యాడ్జిలతో గజపతినగరంలోని డీసీసీబీ బ్రాంచ్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీబీ ఉద్యోగుల జనరల్‌రాష్ట్ర సెక్రటరీ, పీఏసీఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కేవీఎస్ రవికుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాలు ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఈవో నారాయణరావు, పీఏసీఎస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

- గుర్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తెట్టంగి, జమ్ముపేట, కెల్ల, గూడెం పీఏసీఎస్ ఉద్యోగులు గుర్ల డీసీసీబీ బ్యాంకు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పరపతి సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లాన రామునాయుడు మాట్లాడుతూ జీవో-36ను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ చేపట్టాలని, మధ్యంతర భృతి ఇవ్వాలని, చట్టప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం బ్యాంచ్ మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు. నాలుగు సొసైటీల నుంచి సీఈవోలు హాజరయ్యారు.
- గంట్యాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సహకార ఉద్యోగులు గంట్యాడ సహకార బ్యాంకు వద్ద నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని కోరారు. సహకార ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.
- నెల్లిమర్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వలిరెడ్డి గిరిబాబు డిమాండ్ చేశారు. నెల్లిమర్లలోని డీసీసీబీ బ్రాంచ్ వద్ద ఏపీ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేసి ఏజీఎం కో.రజనికి వినతిపత్రం అందజేశారు.



గుర్ల: డీసీసీబీ బ్రాంచి మేనేజర్‌కి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



గంట్యాడ: నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి

- ఎస్పీ మాధవరెడ్డి



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులను త్వరం పరిష్కరించి అర్జీదారులక న్యాయం చేయాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీసు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆయన 9 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, ఎస్ఐ రమేశ్‌నాయుడు పాల్గొన్నారు.



పత్తి పంటను ధ్వంసం చేస్తున్న ఏనుగులు

బియ్యాలవలసలో ఏనుగులు

కురుపాం రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): బియ్యాలవలస పరిసరాల్లో సోమవారం ఏనుగుల గుంపు సంచరించింది. కోతకు వచ్చిన పత్తి పంటను ధ్వంసం చేశాయి. దీంతో స్థానికులు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఏనుగులను రెచ్చగొట్టవద్దంటూ అటవీశాఖ అధికారులు ప్రజలకు సూచించారు. ఏనుగుల జోలికి వెళ్లరాదన్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

టెట్ పక్కాగా నిర్వహించాలి

- ఐదు కేంద్రాల్లో పదో తేదీనుంచి పరీక్షలు
- డీఆర్వో మురళి



మాట్లాడుతున్న మురళి

విజయనగరం, కలెక్టరేట్ డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) జిల్లాలోని టెట్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని డీఆర్వో మురళి కోరారు. సోమవారం విజయనగరంలో టెట్ పరీక్షలు నిర్వహణకు సంబంధించి ఆయా శాఖ అధికారులు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐదు కేంద్రాల్లో ఈనెల 10 నుంచి 21 తేదీ వరకూ జరిగే పరీక్షలకు 13,985 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని చెప్పారు. ఉదయం 9.30 గంటలు నుంచి 12 వరకూ, మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటలు వరకూ పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఐయాన్ డిజిటల్ జోన్‌లో 3129 మంది, ఎంవీజీఆర్‌లో 4035 మంది, లెండిలో 4800, సత్య ఇంజనీరింగ్‌లో 1571 మంది, అవంతి ఇంజనీరింగ్‌లో 450 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని చెప్పారు. పరీక్షకు హాజరు కానున్న అభ్యర్థుల హాల్ టిక్కెట్‌తో పాటు ఒరిజనల్ ఐడి కార్డు తీసుకుని రావాలని సూచించారు. పరీక్ష సమయం కంటే 30 మందు హాజరు కావాలని సూచించారు . పరీక్ష కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన



పోలిపల్లిలో పనులను పరిశీలిస్తున్న సుగుణాకరరావు

భోగాపురం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): భోగాపురం, పోలిపల్లి, కవులవాడ, అమటాంరావివలస, గూడెపువలసల్లో ఉపాధి పథకంలో భాగంగా నిర్వహించిన జలశక్తి అభియాన్ పనులను సోమవారం కేంద్ర వాటర్ కమిషన్ సభ్యుడు పి.సుగుణాకారరావు పరిశీలించారు. ఇటీవల చేసిన పనులను పరిశీలించి నమోదు చేసుకొన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం సిబ్బందిని పలు విషయాలు అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీడీ స్వరూపరాణి, కోర్సు డైరెక్టర్ చిన్నంనాయుడు, ఏపీవో భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..

సీతంపేట రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో కొన్ని రోజులుగా పొగమంచు విస్తారంగా కురుస్తోంది. దీంతో చలితీవ్రత అమాంతం పెరిగింది. చలి తీవ్రతతో ఉదయం 7 గంటల వరకూ మన్యం వాసులు బయటకు వచ్చే పరిస్థితి లేకుంది. మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి చలి తీవ్రత పెరుగుతుండటంతో మన్యం వాసులు అల్లాడుతున్నా రు. రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈఏడాది చలి ఎక్కువగా ఉందని గిరిజనులు అంటున్నారు.

సీతంపేట ఏజెన్సీలో దట్టంగా కురుస్తున్న పొగమంచు



వైర్లు సరిచేయక.. విద్యుత్ సరఫరా కాక

● అంధకారంలో గజపతినగరం జాతీయరహదారి ● చీకట్లోనే వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్న వైనం

గజపతినగరం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం జాతీయ రహదారికిపై పురిటిపెంట పంచాయతీ పరిధిలో ఉన్న విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారంలో నెలకొంది. ఇటీవల ఇక్కడి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఓ ప్రైవేటు షాపు ప్రారంభోత్సవం జరుగుతున్న సమయంలో జాతీయరహదారిపై అధికంగా జనాభా ఉండడంతో ఆర్టీసీ బస్సు వారిని తప్పించబోయి విద్యుత్ వైర్లు ఢీకొనడంతో అవి తెగిపోయాయి. దీంతో ట్రాన్స్‌కో సిబ్బంది ప్రమాదాన్ని నివారించేందుకు వైర్లను తప్పించారు. ఈ ఘటన జరిగి వారంరోజులు దాటుతున్నా వైర్లు సరిచేయకపోవడంతో గజపతినగరంలో పోలీస్‌స్టేషన్ నుంచి ఆ మార్గంలో కొంతవరకూ చీకటిపడితే అమావాస్య తలపిస్తోందని పలువురు వాపోతున్నారు. దీంతో రోడ్డు పక్కన వ్యాపారాలు సాగిస్తున్న చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చీకటిపడిన తర్వాత వచ్చిపోయే వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. పంచాయతీ, ట్రాన్స్‌కో అధికారులు వైర్లు సరిచేయడానికి చర్యలు తీసుకోకపోవడంతో చీకట్లోనేవ్యాపారాలుసాగించాల్సి వస్తోందని వ్యాపారులు వాపోతున్నారు. కాగా జాతీయరహదారిపై ఉన్న విద్యుత్ వైర్లు సరిచేసే విదంగా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని పురిటిపెంట ఈవో జగదీష్ తెలిపారు. నాలుగురోజుల కిందట బదిలీపై వచ్చానని, సిబ్బందితో మాట్లాడి విద్యుత్ సరఫరా పునరుద్ధరించనున్నట్లు చెప్పారు.



జాతీయరహదారిపై వెలగని లైట్లు

వినతులకు తక్షణ పరిష్కారం



వినతిని పరిశీలిస్తున్న నల్లనయ్య

విజయనగరం టౌన్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులను పరిశీలించి తక్షణ పరిష్కారం చూపించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా ఫిర్యాదుల వేదికలోవచ్చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. సంబంధిత అధికారులకు తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులతో పాటు క్షేత్రస్థాయిలో తాము పర్యటించిన సమయంలో వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం చూపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి

శృంగవరపుకోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలో గిరిజనసంక్షేమపాఠశాలకు ఐదెకరాల స్థలం కేటాయించాలని ఇండియన్ రెడ్‌క్రాస్‌సొసైటీ ప్రతినిధి దొడ్డి సూర్యారావు కోరారు.ఈ మేరకు సోమవారం పాఠశాల కమిటీ చైర్మన్ కె.లక్ష్మి, హెచ్‌ఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు.

సృజనాత్మకత పెంపునకు శిక్షణ

రేగిడి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బోధనలో నైపుణ్యత పెంపునకు టీచ్ టూల్ శిక్షణఇస్తున్నట్లు ఎంఈవో వర ప్రసాదరావు, శిక్షణ జిల్లా పరిశీలకులు రమేష్ పేర్కొన్నారు. సోమవారం రేగిడి జడ్పీపాఠశాలలో టీచ్‌టూల్‌పై స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు, హెచ్‌ఎంలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోధన సామర్థ్యం,సృజనత్మకత పెంపునకు ఇస్తున్న సమగ్ర శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్య క్రమంలో ఎంఐసీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సూర్యారావు పాల్గొన్నారు.

●మెరకముడిదాం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంకేతిక సాధనాలు ద్వారా వృత్తి పరమైన పనులను సులభతరంగా పూర్తిచేసేందుకు ఉపయోగపడే టెక్ టూల్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవోలు ఎం.చంద్రశేఖర్, టి.ధర్మశ్రీనులు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, రిసోర్సు పర్సన్లు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

వైఫల్యాలను ఎండగట్టాలి

లక్కవరపుకోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైసీపీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గోల్డ్ స్టార్ జంక్షన్‌లో కోటి సంతకాలపై ఎస్.కోట నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, మాజీ జెడ్పీ చైర్మన్ స్వాతీ రాణి హాజరయ్యారు.

స్క్రబ్‌టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలి

సంతకవిటి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):స్క్రబ్‌టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ కోరారు. ఈ వ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు సచివాలయ, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం సంతకవిటి మండల పరిషత్ కార్యాలయంలో వైద్యాధికారులు యు.నాగేంద్రప్రసాద్, సతీష్‌కుమార్‌తో కలిసి సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య శాఖ సిబ్బందితో స్క్రబ్ టైఫస్ వ్యాధిపై సమీక్షించారు.

విస్తృత ప్రచారం

లక్కవరపుకోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్‌పై విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు ఎల్.కోట పీహెచ్‌సీ వైద్యుడు బి.అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 31 పంచాయతీల్లో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎవరికైనా ఏదైనా పురుగు కుట్టి నల్లటి మచ్చ ఏర్పడితే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని కోరారు.

గిట్టుబాటు ధర కల్పించడమే ధ్యేయం

● శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

వేపాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. సోమవారం మండలంలోని కొండగంగుబూడి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతు పండించే ప్రతి గింజను ప్రభుత్వమే కొంటుందన్నారు. కార్యక్రమంలో ఏవో స్వాతి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, గొలగాని కృష్ణమూర్తి, వెంకటరావు, పరవాడ జగదీష్ ,ముమ్మలూరి సూర్యనారాయణ, సింహాద్రి సత్తిబాబు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):పేదలకు సీఎంఆర్‌ఎఫ్ భరోసాగా నిలుస్తోందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. సోమవారం రాజాంలోని టీడీపీ కార్యాలయంలో 16 మందికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంప్రజారోగ్యం, సంక్షేమంకోసం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, గురవాన నారాయణరావు, కిమిడి అశక్క్‌కుమార్, దూబ ధర్మారావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, టి.గణపతి, మద్ద హరి, మరిపి జగన్మోహన్‌రావు, శాసపు రమేష్‌కుమార్, టంకాల కన్నంనాయుడు, మాడుగుల జయరాం పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలను ఆదుకుంటాం

●నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ బాధిత మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం ద్వారా ఆదుకొనేందుకు చర్యలు తీసుకుంటామని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. సోమవారం కొండ్రాజుపాలెంలో హేచరీస్ నిర్వాహకుల ఆర్థిక సహాయంతో బంగ్లాదేశ్ బాధిత తొమ్మిది మత్స్యకార కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు, 25 కేజీల బియ్యం చొప్పున అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో బందీలుగా ఉన్న మత్స్యకారులతో నేరుగా మాట్లాడడం కుదరడంలేదని, అక్కడ జైలర్‌తో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నామని, అందరూ క్షేమంగానే ఉన్నారని తెలిపారు.బందీలుగా ఉన్న మత్స్యకారులు రావడానికి ఆరు నెలల సమయం పట్టె అవకాశముందని, వారువచ్చే వరకూ వారి కుటుంబాలను ప్రభుత్వం ద్వారా ఆదుకొనేలా ప్రయత్నాలుచేస్తామని తెలిపారు.అనంతరం కొంగవానిపాలెం సమీపంలో ఎయిర్‌పోర్టుకు సంబంధించి నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్,రాంబాబు, సూరాడ చిన్నారావు, మట్టా అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో ఆక్రమణల తొలగింపు

శృంగవరపుకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి దేవీబొమ్మకూడలి వరకు ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న ఆక్రమణలను సీఐ నారాయణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. సీఐ తన సిబ్బందితో తోపుడ బళ్లను తీసి వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి ఆక్రమణలకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సేవా కార్యక్రమాలు అలవరుచుకోవాలి

రాజాం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి స్థాయి నుంచి సేవాకార్యక్రమాలు అలవరుచుకోవాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి సిద్దేశ్వరి కోరారు. సోమవారం రాజాంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బొద్దాం ప్రభుత్వోన్నత పాఠశాలలో శ్రమదానం నిర్వహించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హెచ్‌వీ శశికుమారి తదితరులు పాల్గొన్నారు.

●శృంగవరపుకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యువతరం తమ భవిష్యత్‌ను డ్రగ్స్ నాశనం చేస్తాయన్న విషయం గ్రహించాలని సీఐ నారాయణమూర్తి తెలిపారు. సోమవారం పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీకళాశాలఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సేవాశిబిరం ముగింపు కార్య క్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో భాస్కర్ పాల్గొన్నారు.

●రాజాం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజీయ్యపేటలో సోమవారం జీసీఎస్‌ఎస్‌ఆర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో ప్రకృతివ్యవసాయంపై సదస్సు నిర్వహించారు.అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతు పెంకి గౌరీశ్వరరావు , ఉపాధ్యాయలు ఎ.సత్యారావు, శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో విశ్వనాధం పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

శృంగవరపుకోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో ఈనెల13న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయాధికారి కనకలక్ష్మి కోరారు. ఈ మేరకుసోమవారం న్యాయవాదులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాదులు తమ వద్ద ఉన్న కేసులు రాజీ చేయించాలనీ సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

లక్కవరపుకోట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ప్రజలకు ఆరోగ్యం లభిస్తుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు తెలిపారు. సోమవారం లక్కవరపుకోటలోని వెలుగు, వ్యవసాయ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి సేద్యం ద్వారా పండించిన పంటలకు డిమాండ్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సబ్ డివిజన్ అధికారి భానులత, ఏపీఎం సింహాచలం పాల్గొన్నారు.

నూనె గింజల సాగును ప్రోత్సహించాలి

బొండపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సేంద్రీయ విధానంలో నూనె గింజల సాగును ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయం ఏపీఎం నాయుడు కోరారు. స్థానిక వెలుగు సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘ సభ్యులతో పాటు ప్రకృతి వ్యవసాయసిబ్బందికి నూనెగింజల సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో మల్లిఖార్జునరావు, ఏఈవో సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలు లక్ష్యాలను పూర్తిచేయాలి

రాజాం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల వసూలులక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీవో జె.ఆనందరావు, డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు కోరారు. స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో మొబైల్ ఆధార్ నెంబర్లు అప్‌డేషన్ చేయించాలని ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

అల్యూమినియం పరిశ్రమ ఏర్పాటు చేయండి

ఎస్.కోట రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర, ఇతర ప్రాంతాల్లో 18 ఏళ్ల కిందట జిందాల్ అల్యూమినియం పరిశ్రమ కోసం తమ భూములు సేకరించారని ఈ భూముల్లో అల్యూమినియం కర్మాగారం ఏర్పాటుచేయకపోతే తమ భూములు వెనక్కి ఇవ్వాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. సోమవారం బొడ్డవరలో 178వ రోజు నిరసన కార్య క్రమంలో భాగంగా మాట్లాడుతూప్రత్యామ్నాయ పరిశ్రమలు ఏర్పాటుచేస్తే జిందాల్ ఒప్పందాలు రద్దవుతాయని తెలిపారు.



భూములు వెనక్కి ఇవ్వాలని నినాదాలుచేస్తున్న నిర్వాసితులు

ఏపీఎన్జీవో కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

చీపురుపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏపీఎన్జీవో సంఘం చీపురుపల్లి తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా ఎల్.అప్పలనాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.జగదీశ్వరి, ఉపాధ్యక్షులుగా టీకేకే లక్ష్మణరావు, పి.రవికుమార్, కేవీఎస్‌ఎస్ కిషోర్, ఎల్. వేణుగోపాలరావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా వై. ఝాన్సీ, కార్యదర్శిగా ఎం. అప్పలస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జె.మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగాసాయి అభిరామ్, కె.గోపాలకృష్ణ, ఎస్.హైదర్‌ఆలీ, ఇ.చంద్రకుమారి, కోశాధికారిగా ఎస్. రామారావు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా బీఎస్ ప్రసాద్, జిల్లా కౌన్సిల్‌కు బి. ఉమాశంకర్, కె.రవి, టి.వాసుబాబు, ఎస్.రామ్మోహన్, పి.అరవింద్‌బాబు ఎన్నికయ్యారు.ఎన్నికల పరిశీలకులుగా కేబీ శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పట్టణశాఖ అధ్యక్షుడు వై.ఆనంద్‌కుమార్, పార్వతీపురం తాలూకా యూనిట్ ప్రతినిధులు దుర్గాప్రసాద్, మధు, శంకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్‌తో అగచాట్లు

రాజాం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):రాజాంలో ఆటోలను రద్దీగా ఉండే ప్రాంతాల్లో పార్కింగ్ చేయడం వల్ల వాహనచోదకులు, పాదచారులు అగచాట్లకు గురవుతున్నారు. తరచూ డీఎస్పీ, సీఐ తదితరులు ఆటోడ్రైవర్లతో సమావేశాలు నిర్వహించి నిబంధనల గురించి వివరిస్తున్న విషయం విదితమే. మెయిన్‌రోడ్‌లోని ప్రభుత్వోన్నత పాఠశాల, పశువుల ఆసుపత్రి, మాధవబజార్ జంక్షన్, సంపత్‌భవన్ వంటి రద్దీగా ఉండే ప్రాంతాల్లో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. కాగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

విజయనగరంలో గంధమహోత్సవం

విజయనగరం రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కోట్ల మాదప్ప వీధిలోని హజరత్ సయ్యద్ దలియాఖాన్ బాబా అవులియా గంధ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉత్సవానికి ముందు అన్నదాన కార్యక్రమం,నమాజ్, బాబాకి పూజలుచేశారు. కార్యక్రమంలో నగర ముస్లింశాఖ ప్రతినిధి మహ్మద్ గౌస్, షేక్ బాబా, సిద్ధిక్, అజీజ్, అజీం, అన్వర్,సలీం పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నియంత్రణకు కృషి చేయాలి

బొండపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సైకాలజిస్టు ఎస్‌వీ రమణ తెలిపారు.రు. సోమ వారం బొండపల్లిలో ఎంపీపీ చల్లా చలం నాయుడు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమలో బొండపల్లి, దేవుపల్లి పీహెచ్‌సీల వైద్యులు ఎల్.సత్యనారాయణ, శర్మిష్టా, ఎంపీడీవో గిరిబాల, ఎంఈవో-2 వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌ఏ భాషా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



రాజాం: ప్రతిజ్ఞ చేయిస్తున్న అడిషనల్ సీడీపీవో సన్యాసమ్మ

రాజాం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అడిషినల్ సీడీపీవో సీహెచ్ సన్యాసమ్మ కోరారు. మునిసిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రకారం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, శిక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

● భోగాపురం,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి):భోగాపురంలో ఐసీడీఎస్ సీడీపీవో లావణ్య ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమలో ఎంపీడీవో స్వరూపరాణి, డిప్యూటీ ఎంపీడీవో గాయిత్రి, ఎంఈవో రమణమూర్తి, సూపర్‌వైజర్ హేమ, పీహెచ్‌సీ వైదాధికారి స్రవంతి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి మృతి

పాలకొండ, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): పనుకువలస కూడలిలో సోమవారం రాత్రి ద్విచక్రవాహనం ఢీకొనడంతో పొట్నూరు రామినాయుడు (57) మృత్యువాతపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. బుక్కురు గ్రామానికి చెందిన రామినాయుడు పశువులకాపరిగా జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి రహదారి పక్క నుంచి నడుచుకని స్వగ్రామానికి వెళ్తుండగా పాలకొండ నుంచి వీరఘట్టం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఆయన్ను ఢీకొంది. దీంతో ఆయన తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు క్షతగాత్రుడిని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామినాయుడు మృతి చెందారు. మృతుడి భార్య చిన్నమ్మడు కొన్నేళ్ల కొందట మృతిచెందారు. కుమార్తె రూప ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ ప్రయోగమూర్తి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎస్.కోట రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపుసోంపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారంసాయంత్రం సబ్బవరం మండలంలోని దువ్వాడ కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు. సీఐ కథనం మేరకు.. సబ్బవరం మండలంలోని దువ్వాడ కాలనీకి చెందిన కిలారి గంగన్న, గొడ్డు ఆదర్శ్ తమ ద్విచక్రవాహనంపై అరకు నుంచిఎస్.కోట వైపు వస్తున్నారు. అదేసమయంలో ఎస్.కోట నుంచి అరకు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం కాపుసోంపురంవద్ద ఢీకొన్నాయి. దీంతో ఓ ద్విచక్రవాహనంపై ఉన్న గంగన్న, ఆదర్శ్‌కు గాయాలయ్యాయి. కుటుంబసభ్యుల పిర్యాదుమేరకు కేసు నమోదుచేశారు.

విద్యుదాఘాతంతో విద్యార్థికి..

మెంటాడ, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆంధ్ర జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి కిలారి రామ్ చరణ్ సోమవారం విద్యుదాఘాతానికిగురై గాయపడినట్లు ఎంఈవోమోహనరావు తెలిపారు. ఎంఈవో, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. సోమవారం ఉదయం ప్రత్యేక తరగతుల నిమిత్తం హైస్కూల్‌కు రామ్‌చరణ్ వచ్చాడు. తరగతులు ప్రారంభానికి సమయం ఉండడంతో కొత్తగా నిర్మిస్తున్న పాఠశాల పైభాగానికి వెళ్లాడు. పాఠశాల పైనుంచి కొద్దిసేపటికే కిందకు పడిపోయాడు. శబ్దం విని అక్కడే ఉన్న విద్యార్థులు పరిగెత్తారు. దీంతో రామ్‌చరణ్‌ను చూసిన సహచర విద్యార్థులు భయంతో కేకలు వేయడంతో గ్రామస్థులు అక్కడకు చేరుకున్నారు. గాయపడిన రామ్‌చరణ్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్థులు గజపతినగరం ఏరియాఆస్పత్రికి తీసుకువెళ్లగా, పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం జీజీహెచ్‌కు తరలించారు. శరీరంపై గాయాలు బట్టి విద్యుదాఘాతానికి గురైనట్లు వైద్యులు స్పష్టంచేశారు. కాగా పాఠశాల భవనం పైనుంచి వెళ్తున విద్యుత్ వైర్లు తొలగించాలని విద్యుత్ అధికారులను లిఖితపూర్వకంగా కోరామని, తమ ఫిర్యాదు పట్టించుకోకపోడంతో ప్రమాదం సంభవించిందని ఎంఈవో మోహనరావు, ఉపాధ్యాయులు తెలిపారు. రామ్‌చరణ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు.

తొమ్మిది మంది పందెంరాయుళ్ల అరెస్టు

కొత్తవలస, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంటకాపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో కోడిపందేలు ఆడుతున్నవారిని పట్టుకుని అరెస్టు చేసినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం తమకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు చేయగా తొమ్మిది మంది నిందితులను పట్టుకుని వీరి వద్దనుంచి 16,440 రూపాయలు, 10 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు పందెంరాయుళ్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

కిలో గంజాయితో కేరళ వాసి..

కొత్తవలస, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేరళకు చెందిన ఓ వ్యక్తిని కిలో గంజాయితోఅరెస్టుచేసినట్టు సీఐషణ్ముఖరావు తెలిపారు.సీఐ కథనం మేరకు.. ఎస్ఐ జోగారావుకు సోమవారం వచ్చిన సమాచారం మేరకు కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని సోదాచేయగా బ్యాగ్‌లో కిలో గంజాయి లభించింది. దీంతో కొత్తవలస ఇన్‌చార్జి తహసీల్దార్ సునీత సమక్షంలో ఆ వ్యక్తి వివరాలను సేకరించారు. కేరళలోని కొత్తప్పడి వాయినడ్ జిల్లా మెప్పడి గ్రామానికి చెందిన పిచన్ కున్ అసిరి నాశిక్ అలియాస్ నాజిక్ పీకె(29)గా గుర్తించారు. తహసీల్దార్, వీఆర్వోల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

భోగాపురం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): భోగాపురానికి చెందిన యువకుడు ఆవాల చిరంజీవి అదృశ్యమయ్యాడని తల్లి లక్ష్మి ఫిర్యాదు చేసినట్లు సీఐ కె.దుర్గాప్రసాదురావు సోమవారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. చిరంజీవి కొత్తవలసలో పెయింటింగ్ పనులు చేస్తుండేవాడు. గతనెల ఒకటో తేదీ నుంచి తనకుమారుడు కనిపించకపోవడంతో బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద, ఇతర గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసునమోదు చేశారు.

'రామాయణంలో ఆణిముత్యాలు' పుస్తకావిష్కరణ

విజయనగరం కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని జడ్పీ సమావేశ భవనంలో డోలా మన్మథకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సోమవారం రామాయణంలో ఆణిముత్యాలు అన్న పుస్తకాన్ని వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ కర్రోతు సత్యం,దేవునితో కాసేపు పుస్తకాన్ని నీటిపారుదలశాఖ రిటైర్డు చీఫ్ ఇంజనీరు ఐఎస్ ఎన్ రాజు ఆవిష్కరించారు. జిల్లా రచయితల సంఘం, జిల్లా గ్రంథాలయ సేవా సంఘం సంయుక్త నిర్వహణలో నాలుగెస్సల రాజు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాలుగెస్సల రాజుతో పాటు, జిల్లాగ్రంథాలయ సేవా సంఘం ప్రతినిధులు కె.ఎర్రినాయుడు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వార్డులో సమస్యలను పరిష్కరిస్తా: కమిషనర్

రాజాం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వార్డులో ప్రధాన సమస్యలను పరిష్కరిస్తానని రాజాం మునిసిపల్ కమిషనర్ రామచంద్రరావు తెలిపారు. సోమవారం మునిసిపాలిటీలోని 17వ వార్డు పరిధిలోని ఆదర్శనగర్, గోపాలపురం రోడ్ తదితర ప్రాంతాలను సందర్శించారు. డ్రైనేజి సమస్య తీవ్రంగా ఉందని, పలు వీధుల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయని వార్డు నాయకులు మరిపి జగన్మోహనరావు, గంధి గోపి, రామారావు, ఎరుకునాయుడు తదితరులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.



సమస్యలను కమిషనర్‌కు వివరిస్తున్న 17వ వార్డు వాసులు

మృతిచెందిన చేపల తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయనగరంటౌన్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పెద్దచెరువులో మృతిచెందిన చేపలను తరలించారు. పెద్దచెరువు ఎందుకిలా శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కార్పొరేషన్ అధికారులు స్పందించారు. ఈమేరకు నగరపాలకసంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశాలమేరకు ప్రజారోగ్యసిబ్బంది, మత్స్యకార సొసైటీ ప్రతినిధులు సంయుక్తంగా చేపలను తరలించారు. చెరువులో మృతిచెందిన గొరవ చేపలను తొలగించేందుకు సిబ్బందిని సిద్ధంగా ఉంచామని కమిషనర్ తెలిపారు.పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటుచేసి చెరువుచుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రం చేయనున్నట్లు చెప్పారు. మృతి చేపలను గుణుపూరుపేటలో ఉన్న డంపింగ్‌యార్డులో గొయ్యి తీసి అందులో పూడ్చిపెట్టినట్లు తెలిపారు.



మృతిచెందిన చేపలను తరలిస్తున్న సిబ్బంది

ఆపదల ముళ్లు

(ఐదో పేజీ తరువాయి)

ఉండడం లేదు. దీంతో ఎక్కువ మంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. బస్సులు, కార్లలో వెళుతున్నారు. పొగమంచు ఎక్కువగా ఉండడం, వాహనాల రద్దీ, డ్రైవర్ల నిద్రలేమి తదితర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

పొగమంచుతో మరీ ప్రమాదం

సమయం కలిసివస్తుందని భావించి చాలామంది కార్లలో శబరిమలై వెళుతున్నారు. అటునుంచి అన్ని పుణ్యక్షేత్రాలను సందర్శించి రావొచ్చని భావిస్తున్నారు. అయితే జిల్లా నుంచి శబరిమలై దాదాపు 1400 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఒకవైపు ప్రయాణానికి 30 గంటలు పట్టే అవకాశం ఉంది. ఎక్కువ మంది 7 సీట్ల కారును ఆశ్రయిస్తున్నారు. అన్ని గంటల పాటు ప్రయాణం అంటే కచ్చితంగా ఇద్దరు డ్రైవర్లు ఉండాలి. ఒకవైపు కఠిన దీక్ష, నిద్రలేమి, ఆహారం సక్రమంగా ఉండకపోవడం, పొగమంచు తదితర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. భక్తులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ మూడు నెలల వ్యవధిలోనే జిల్లా నుంచి 300 నుంచి 500 వరకూ బస్సులు.. మరో 1000 వరకూ ప్రైవేటు వాహనాలు వెళుతుంటాయని అంచనా.

చాలీచాలని రైళ్లు..

జిల్లా నుంచి రైళ్ల సౌకర్యం అంతంతమాత్రంగా ఉంది. విశాఖ నుంచి 20 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు రైల్వేశాఖ చెబుతోంది కానీ ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా, చత్తీస్‌గఢ్‌ల నుంచి వెళుతున్న భక్తులతో ఈ ప్రత్యేక రైళ్లు చాలడం లేదు. నవంబరు 16 నుంచి డిసెంబరు 27 వరకూ.. డిసెంబరు 30 నుంచి జనవరి 20 వరకూ శబరిమలైలోని అయ్యప్ప ఆలయం తెరిచే ఉంటుంది. మకర జ్యోతి కోసం జిల్లా నుంచి వేలాది మంది భక్తులు వెళుతుంటారు. కానీ విశాఖ నుంచి మాత్రమే శబరిమలై ప్రత్యేక రైల్ సర్వీసులు నడుపుతున్నారు. శ్రీకాకుళం నుంచి ఏర్పాటు చేసినా జిల్లా భక్తులకు అవకాశం లేదు. సాధారణంగా గురుస్వామి నేతృత్వంలో పదుల సంఖ్యలో భక్తులు ఒకేసారి శబరిమలై వెళుతుంటారు. రైలులో నేరుగా వెళ్లే సౌకర్యం లేకపోవడంతో ఎక్కువ మంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా రైల్వేశాఖ స్పందించి నేరుగా శబరిమలైకు ప్రత్యేక రైళ్లు నడపాలని అయ్యప్ప భక్తులు కోరుతున్నారు.

కన్నీటి సంద్రం

(ఐదో పేజీ తరువాయి)

పీవీవీ గోపాలరాజు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి తదితరులు చంద్ర రావు కుటుంబాన్ని పరామర్శించారు.

కన్నీరుపెట్టిన కోరపుకొత్తవలస

కోరపుకొత్తవలస గ్రామానికి మార్పిన అప్పలనాయుడు, వంగర రామకృష్ణ, మరడ రాముల మృతదేహాలు సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో స్వగ్రామం చేరుకున్నాయి. కడసారి చూసేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, స్థానికులు భారీగా తరలి వచ్చారు. ప్రమాదం జరిగి మూడు రోజులు కావడంతో బరువెక్కిన గుండెలతో కన్నీటి వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. గ్రామమంతా బంధువుల రోదనతో విషాదమయమైంది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గ్రామానికి చేరుకొని మృతదేహాల వద్ద నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

ఆందోళనలో వారు.. ఆశల్లో వీరు

(ఐదో పేజీ తరువాయి)

దావా ఉంది. ఇలా అన్ని వైపుల నుంచి భూ నిర్వాసితులు న్యాయం కోసం పోరాటం చేస్తున్నారు. ఇంత జరుగుతున్న జిందాల్ పరిశ్రమ నుంచి పలుకు, పలుకు లేదు. వీరి సమస్యను ఎటూ తేల్చకపోవడంతో ఎంఎస్‌ఎంఈ పార్కుల నిర్మాణానికి పునాది రాయి పడలేదు. ఆ భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిశాక నిరుద్యోగ యువత ఆశలకు రెక్కలు తొడిగాయి. వివిధ రకాల సాంకేతిక విద్య, డిగ్రీ, పీజీ వంటి ఉన్నత చదవులు చదువుకున్న వారు కూడా స్థానికంగా ఉండి ఉద్యోగం చేసుకొనే అవకాశం దొరుకుతుందని కలలు కంటున్నారు. పరిశ్రమల రాకకోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల మంత్రి మండలి ఈ భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కుల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తున్నారని ఏ నెలకానెల ప్రచారం జరుగుతోంది. ఇందుకు అనుగుణంగా నెల రోజుల క్రితం వరకు బోసిపోయి ఉండే జిందాల్ తాత్కాలిక కార్యాలయానికి ఇప్పుడు రంగులు అద్దారు. అదనంగా కంటైనర్ కార్యాలయం తెరిచారు. శాశ్వత హెలిప్యాడ్ కూడా రూపుదిద్దుకుంది. జెఎస్‌డబ్ల్యూ అల్యూమినియమ్ లిమిటెడ్ స్థానంలో నూతనంగా జెఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కుగా బోర్డు వెలిసింది. అయితే ఎంఎస్‌ఎంఈ పార్కుల నిర్మాణానికి భూమి పూజ ఎప్పుడు జరుగుతుందో పరిశ్రమ యాజమాన్యం స్పష్టత ఇవ్వలేకపోతోంది. భూ నిర్వాసితులు ఉద్యమం చేస్తుండడంతో కాలయాపన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితి వల్ల ఇటు భూనిర్వాసితులకు, అటు నిరుద్యోగ యువతకు నష్టం జరుగుతోంది.

● దాదాపు ఆరు నెలలుగా పోరాటం చేస్తున్నప్పటికీ జిందాల్ యాజమాన్యం కనీసం రైతులతో ఒక్కసారి కూడా చర్చలు జరపలేదు. భూ నిర్వాసితులు రోజుకొక్కటి చొప్పున అందిస్తున్న ఫిర్యాదులతో రెవెన్యూ అధికారులకు పనిభారం పెరుగుతోంది. అప్పట్లో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా మళ్లీ వెలుగు చూస్తున్నాయి. ఇదే సమయంలో ఎంఎస్‌ఎంఈ పార్కుల నిర్మాణానికి ఒక్క అడుగు కూడా పడకపోవడంతో నిరుద్యోగ యువతలో నిరాశ గూడు కట్టుకుంటోంది.

పచ్చని పొలాల్లో పరిశ్రమ వద్దు

(ఐదో పేజీ తరువాయి)

ఏర్పడి నినాదాలు చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ తోటపల్లి రిజర్వాయర్ వచ్చిన తరువాత తమ భూముల్లో పంటలు విస్తరించాయని, ప్రతి కుటుంబం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తోందని చెప్పారు. రెండు పంటలు సాగు చేస్తున్నామని, అటువంటి పొలాల్లో ప్రైవేటు స్టీల్ పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకోవడం సరికాదన్నారు. పరిశ్రమ వస్తే తమ భూములు పోవడంతో పాటు ఉపాధి కూడా పూర్తిగా దెబ్బతింటుందన్నారు. తమకు కనీసం సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు భూములను పరిశీలించి సర్వేలకు సిద్ధపడడం బాగాలేదన్నారు. ఉక్కు పరిశ్రమను వేరే చోటకు తరలించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌వో మురళికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు రాంబాబు, మీసాలు ప్రసాద్, మందపాటి కృష్ణమూర్తిరాజు, తమ్మినేని సూర్యనారయణ పాల్గొన్నారు.

ఎక్కడికక్కడే లీకేజీలు

(ఐదో పేజీ తరువాయి)

సైతం తవ్వేస్తున్నారు. రిపేరు పనులకు రూ.లక్షల్లో వెచ్చిస్తున్నారు తప్పా కొత్త పైపులైన్ మార్పునకు ప్రయత్నించడం లేదు.

● నగర సమీపంలోని నెల్లిమర్ల నుంచి 11 కిలోమీటర్ల మేర పైపులైన్ ఉంది. అలాగే ముషిడిపల్లి నుంచి 24 కిలోమీటర్ల దూరంలో ఉన్న 36 వాటర్ ట్యాంకులకు తాగునీరు పంపిణీ జరుగుతోంది. ఈప్రధాన పైపు లైన్‌కు కూడా అక్కడికక్కడ లీకులు ఇచ్చి తాగునీరు వృథాగా పోతోంది.

పైప్‌లైన్‌లు మార్చాలి

నగరంలో చాలాచోట్ల పైపులైన్‌లు తుప్పుపట్టి పాడయ్యాయి. తరచూ మరమ్మతులు చేపట్టి వాటికే రూ.లక్షల్లో వెచ్చిస్తున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని పైపులైన్ల ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలి.

- బెవర వేణుగోపాల్, స్థానికుడు, 45వ డివిజన్

రూ.వెయ్యికోట్లు కావాలి

నగరంలో కొన్నిచోట్ల పైపులైన్ పాడవ్వడం వాస్తవమే. ఏర్పాటుచేసి సుమారు నాలుగు దశాబ్దాలు అయ్యి ఉండొచ్చు. పాడవుతున్నప్పుడు మరమ్మతులు చేపడుతున్నాం. నగరమంతా నూతన పైపులైన్ ఏర్పాటుచేయాలంటే సుమారు రూ.వెయ్యి కోట్లు అవసరం. ఇటీవల అమృత-2 పథకంలో భాగంగా రూ.66కోట్లతో పైపులైన్ ఆధునికీకరణ పనులు చేపడుతున్నాం.

- ప్రసాద్, ఈఈ, కార్పొరేషన్, విజయనగరం

రోడ్డు సుందరీకరణకు చెట్ల తొలగింపు

బొబ్బిలి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి పార్వతీపురం రోడ్డులో గల డివైడర్‌లోని చెట్లను మున్సిపల్ అధికారులు సోమవారం తొలగించారు. ఈ చెట్లు ఏపుగా పెరగడంతో రాత్రివేళల్లో వీధి దీపాల కాంతులు వాహనదారులకు కనిపించకపోవడంతో వారు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇటీవల ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఎల్‌ఈడీ విద్యుత్ రోప్ లైటింగ్స్ సుందరీకరణ కోసం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అదే పద్ధతిలో బొబ్బిలి-పార్వతీపురం రోడ్డులోని సెంటర్ లైటింగ్ పోల్స్‌కు ఈ నూతన ఎల్‌ఈడీ రోప్ లైటింగ్స్‌ను అమర్చేందుకు మున్సిపల్ కౌన్సిల్ ఇటీవల తీర్మానం చేసింది. ఈ మేరకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన సూచనల మేరకు ఈ ప్రక్రియ చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. తొలగించిన చెట్ల స్థానంలో కొత్తగా ఆకర్షణీయమైన, ఆహ్లాదకరమైన మొక్కలను డివైడర్లలో నాటుతామన్నారు. సామాజిక కార్యకర్తలు, దాతలు మొక్కలను వితరణగా అందజేస్తే స్వీకరిస్తామని ఆమె స్పష్టం చేశారు.



డివైడర్‌పై చెట్లను తొలగించిన దృశ్యం

మూడురోజులకోసారి తాగునీరు

బొబ్బిలి రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): కోమటిపల్లిలో తాగునీటి కుళాయిల నుంచి తాగునీరు సక్రమంగా రావడం లేదని మహిళలు ఆందోళన చెందుతున్నారు. మూడురోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతుండటంతో అవసరాలు తీరడంలేదని వారంటున్నారు. అదీ వీధిలో కొన్ని కుళాయిల నుంచే నీరు వస్తోందన్నారు. జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసినా సక్రమంగా తాగునీరు సరఫరా కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేయాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వతేజ వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



కోమటిపల్లిలో కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

ముురుగు కాలువలను శుభ్రపరచండి

బొబ్బిలి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని రైల్వేస్టేషన్ రోడ్డు జంక్షన్‌లో హోటళ్ల కూడలి వద్ద మురుగు కాలువలను వెంటనే శుభ్రం చేయాలని శానిటేషన్ సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. వార్డు పర్యటనలో భాగంగా ఆమె సోమవారం సాయినగర్ సచివాలయ పరిధిలోని రైల్వేజంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, జూట్ మిల్లు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళి, సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ఫైర్‌స్టేషన్ సమీపంలోఇ ఖాళీస్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. రోడ్డు డివైడర్‌పై మొక్కలకు షేపింగ్ చేయించాలని కమిషనర్ ఆదేశించారు.



సాయినగర్ రోడ్డులో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలి

బొబ్బిలి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు అప్రమత్తత పాటించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ సూచించారు. సోమవారం పట్టణంలోని పలు కూడళ్లలో ఆటోలు, టాక్సీల స్టాండ్‌లలో డ్రైవర్లకు ఎస్‌ఐ అవగాహన కల్పించారు. ప్రాణాలు అత్యంత విలువైనవని, వాటిని కాపాడుకోవాలన్నారు. నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సామర్థ్యానికి మించి ప్రయాణికులను రవాణా చేయడం వంటివి చట్టరీత్యా నేరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి భారీగా జరిమానా, జైలు శిక్ష తప్పదన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 8 వినతులు

బాడంగి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 8 వినతులు అందాయని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల కోసం ముగ్గురు, ఇతర శాఖలకు సంబంధించి 5 దరఖాస్తులు అందాయన్నారు. ఈ దరఖాస్తులు ఆయా శాఖల అధికారులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

బుడాపై నేడు అమరావతిలో సమావేశం

(ఐదో పేజీ తరువాయి)

స్వీకరించిన తరువాత వాటిని రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపించారు. వాటిపై మంగళవారం చర్చించిన మీదట తుది నిర్ణయాన్ని ప్రకటిస్తారు.

● బుడా అధికారులు, మూడు మునిసిపాలిటీల టౌన్‌ప్లానింగ్ అధికారులు, పంచాయతీల సిబ్బంది అమరావతి బయలుదేరి వెళ్లారు. బొబ్బిలి పట్టణాల్లో మాస్టర్ ప్లాన్ తుది రూపు ఎలా ఉంటుందోనని పట్టణ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మూడు ప్రధాన రహదారులను ఎన్ని అడుగుల మేరకు విస్తరిస్తారో? అన్న ఉత్కంఠ అందరిలో నెలకొంది. స్థానిక పాత కోర్టు జంక్షన్ నుంచి పోలీసుస్టేషన్, చర్చిసెంటరు, అమ్మిగారి కోనేరుగట్టు సెంటరు వరకు గతంలో మాస్టర్ ప్లాన్‌లో 62 అడుగుల వెడల్పును ప్రతిపాదించినప్పటికీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 52 అడుగులలో విస్తరించిన సంగతి తెలిసిందే. స్థానిక రైల్వే జంక్షన్ నుంచి గాంధీ బొమ్మ సెంటరు మీదుగా మార్కెట్ రోడ్డు వరకు 80 అడుగులు, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కాలేజీ రోడ్డు, పూల్‌బాగ్ రోడ్డు కూడా అత్యంత కీలకం. ఈ రోడ్డను మూడు విభాగాలుగా 100, 80, 60 అడుగులలో విస్తరించాలని నూతన మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించారు. తుదిరూపు ఎలా వస్తుందోనని స్థానికులు ఎదురు చూస్తున్నారు.

వారిదే తుది నిర్ణయం

బుడా పరిధిలోని పట్టణాల మాస్టర్ ప్లాన్‌లకు సంబంధించి మంగళవారం ఉన్నతాధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో మాస్టర్‌ప్లాన్‌లపై నిర్ణయం తీసుకుంటారు. ఇక మీదట బుడా నుంచి అప్రూవల్ తీసుకోవాల్సి ఉంటుంది. గ్రామపంచాయతీలలో నిర్మాణాలకు కూడా బుడా అనుమతి అవసరం.

- ఫిలిప్, టౌన్‌ప్లానింగ్ అధికారి, బొబ్బిలి

దివ్యాంగుడికి టచ్ ఫోన్ అందజేత

పార్వతీపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలంలోని గరుగుబిల్లికి చెంది దివ్యాంగుడు ఎ.అఖిల్‌కు తనకు టచ్ ఫోన్ మంజూరు చేయాలని సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తక్షణమే టచ్ ఫోన్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, విభిన్న ప్రతిభావంతులు శాఖాధికారి ప్రతినిధి రమణ ఉన్నారు.

భోజన పథకాన్ని ప్రైవేటీకరించవద్దు

కురుపాం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకాన్ని స్మార్ట్ కిచెన్ పేరుతో ప్రైవేటీకరించాలనే ప్రభుత్వ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

పారాది వంతెన స్లాబ్ పనుల ప్రారంభం

బొబ్బిలి రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): పారాది వద్ద వేగావతి నదిపై నిర్మిస్తున్న వంతెన స్లాబ్ పనులను సోమవారం బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు ప్రారంభించారు. బ్రిటిష్ కాలం నాటి కట్టిన పాత వంతెన కుంగిపోవడంతో నూతన వంతెన నిర్మాణం చేపడుతున్నారు. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కాజ్‌వే కొట్టుకుపోవడంతో కొత్త కాజ్‌వే నిర్మాణానికి కలెక్టర్ రామసుందర్‌రెడ్డి రూ.15 లక్షలు మంజూరు చేశారు. దాంతో ఇటీవలే పనులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో వంతెన స్లాబ్ పనులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న బుడా చైర్మన్ తెంటు

ధాన్యం మిల్లుల తనిఖీ

బొబ్బిలి రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రైస్ మిల్లులను తహసీల్దార్ ఎం.శ్రీను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేవీఆర్ వెంకట కామేశ్వరి మోడరన్ రైస్ మిల్లు, కింతలివానిపేట రామాంజనేయ రైస్ మిల్లు, పిరిడిలోని రైస్ మిల్లులను ఆయన పరిశీలించారు. మిల్లు వద్ద రైతులతో మాట్లాడారు. మిల్లర్లు అదనపు ధాన్యాన్ని డిమాండ్ చేస్తే ఇవ్వవద్దన్నారు. ఎవరైనా ఇబ్బంది పెడితే మండల కమిటీకి సమాచారం ఇవ్వాలన్నారు. అలా ఇబ్బంది పెట్టిన మిల్లులను డీ ట్యాగింగ్ చేస్తామన్నారు. అన్ని మిల్లులకు స్వర్ణ సంపద ధాన్యం ముక్కలు అవుతుందనే విషయంపై ఐదుగురు సాంకేతిక సహాయకులను పంపించామన్నారు. మీ ధాన్యాన్ని దగ్గరుండి టెస్ట్ మిల్లింగ్ చేస్తారన్నారు. ఆయనతో పాటు ఏడీఏ మధుసూదనరావు, ఏవో శ్యామ్‌సుందర్, సీఎస్ డీటీ సాయికృష్ణ పాల్గొన్నారు.



కింతలివానిపేటలోని మిల్లును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

రహదారి భద్రతపై స్పెషల్ డ్రైవ్

రామభద్రపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత కోసం వాహనచోదకులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు సూచించారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా హెల్మెట్ వాడకం, మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి కారణాలతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాటిని నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికే ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సిగ్నల్ బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. అలాగే వాహనాలపై ఎక్కువ చలానాలు ఉన్నవాటిపై గుర్తించి అపరాధ రుసుం విధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెలమల ప్రసాదరావు పాల్గొన్నారు.



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సీఐ

8వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు




నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు

రామభద్రపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పారిశుధ్య కార్మికుల రిలే నిరాహారదీక్షలు సోమవారం 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని వీధుల్లో తిరుగుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. నాలుగు నెలల నుంచి బకాయిలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇటీవల 3 నెలల జీతాలు ఇస్తామని పంచాయతీ అధికారి హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.9వేల గౌరవ వేతనాన్ని రూ.15వేలకు పెంచాలని, పారిశుధ్య కార్మికులకు యూనిఫాం, గ్లౌజులు, శానిటేషన్‌కు సంబంధించి పనిముట్లు ఇవ్వాలని నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు బలసా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

వీరఘట్టం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): నడుకూరు శివారులోని ఇటుకల బట్టీలు వద్ద ఆదివారం రాత్రి పేకాట శిబిరంపై ఎస్ఐ కళాధర్ దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.43,500 స్వాధీనం చేసుకున్నారు.



జీవో 36ను అమలు చేయండి

బొబ్బిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఉద్యోగులకు జీవో నెంబరు 36ను తక్షణమే అమలు చేయాలని సహకార సంఘాల నాయకుడు వెన్నెల తమ్మినాయుడు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ప్రొసీడింగ్స్ ఇచ్చి డీఎల్‌ఎస్‌ఎఫ్ ఏర్పాటుతో జీతభత్యాలు చెల్లించాలన్నారు. ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్య వేదిక పిలుపు మేరకు సోమవారం స్థానిక డీసీసీబీ శాఖ కార్యాలయం ఎదుట సహకార సంఘాల ఉద్యోగులు ధర్నా చేపట్టారు. బొబ్బిలి సహకార బ్యాంక్ శాఖ పరిధిలోని బొబ్బిలి, చింతాడ, కోమటిపల్లి, కలవరాయి, పిరిడి సహకార సంఘాల ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ్మినాయుడు మాట్లాడుతూ ప్రతీ ఐదేళ్లకోసారి వేతనసవరణ చేయాల్సి ఉండగా ఇంతవరకు జరగలేదన్నారు. 2019, 2024 నాటి వేతన సవరణలను చేపట్టాలని, మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. రూ.2 లక్షల గ్రాట్యుటీ సీలింగ్‌ను ఎత్తివేసి చట్టప్రకారం చెల్లింపులు జరపాలన్నారు. ధర్నాలో సంఘ నాయకులు అప్పలనాయుడు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

●రామభద్రపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రామభద్రపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఉద్యోగులు సోమవారం డీసీసీబీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో చింతల వాసుదేవరావు మాట్లాడుతూ వేతన సవరణ, బకాయిల చెల్లింపు, ఖాళీ పోస్టుల భర్తీతోపాటు జీవో నెంబరు 36ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఈవోలు మజ్జి రమేష్‌నాయుడు, కోట భాస్కరరావు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీసీసీబీ ఉన్నతాధికారులకు అందించారు.



వినతిపత్రం అందిస్తున్న సొసైటీ సీఈవోలు

తెర్లాం యూనిట్ ఎన్జీజీవో ఎన్నిక ఏకగ్రీవం

తెర్లాం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): తెర్లాం యూనిట్ ఏపీ ఎన్జీజీవో ఎన్నికలు సోమవారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా మెడికల్ విభాగానికి చెందిన నాగేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.వినయ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జోగినాయుడు, మహేశ్, దాస్, కార్యదర్శులుగా ప్రసాదరావు, సత్యనారాయణ, రామ్‌గోపాల్, నిర్మలాదేవి, కోశాధికారిగా అరుణ్ సూర్యలను ఎన్నుకున్నారు. వీరితో పాటు కొంతమందిని కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా జి.సూర్యనారాయణ, బి.రామారావు వ్యవహరించారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

ఆర్ట్, క్రాఫ్ట్ ఉపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సురేష్

రామభద్రపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఆర్ట్, క్రాఫ్ట్ వ్యాయామ ఉపాధ్యాయుల యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కాళ్ల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ భవనంలో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివకుమారి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.శేఖర్‌ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాళ్ల సురేష్ మాట్లాడుతూ సంఘం పురోభివృద్ధికి అధిక సభ్యత్వాలు నమోదు చేసి కృషి చేస్తానన్నారు. అలాగే రాష్ట్రశాఖ తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి సమస్యల పరిష్కారంలో తమవంతు కృషి చేస్తాన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రెడ్డి శంకరరావు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ శంకర్, కన్వీనర్లు వెంకటరమణ, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సురేష్‌ను పలువురు అభినందించారు.

స్క్రబ్ టైఫస్‌పై అవగాహన పెంచుకోండి

రామభద్రపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): నల్లి లాంటి పురుగు కుట్టడం ద్వారా వచ్చే స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని నాయుడువలస పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు జేసి రాజు సూచించారు. నాయుడువలసలో సోమవారం ఈ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధిక జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భవాని, ఉపాధ్యాయుడు రాజమ్మ, జగదీశ్వరి, కృష్ణంనాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

